www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 13 | ఆగస్టు | 2025 పేజీలు : 8

# సారు నిద్రపోయారు.. పిల్లలు ఇంటికెళ్లారు



**-బడికి రాక కొందరు..**
**వచ్చి బోధించని మరికొందరు**

**ప్రజాపక్షం/ గుండాల :** ప్రభుత్వ విద్య అబాసు పాలు అవుతుంది. కేవలం ప్రభుత్వ వైఖరి ఉపాధ్యాయుల తీరు కారణంగానే ఒకప్పుడు కీర్తించ బడిన ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు విమర్శలకు కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకోకపోవడం, అర కొర చర్యలను ఉపాధ్యాయ సిబ్బంది లెక్కచేయక పోవడంతో ప్రభుత్వ విద్య పరిస్థితి నానాటికి తీసికట్టు

మిగతా 2లో..

# వైరాలో స్టీరింగ్ లేని కారు పార్టీ






**-ఇంచార్జి లేక ఇక్కట్లు**
**-మదన్‌లాల్ మరణం తర్వాత నైరాశ్యంలో పార్టీ క్యాడర్**
**-పార్టీకి నష్టం చేసిన వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైరా నియోజక వర్గంలో బిఆర్ఎస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. రెండు సార్లు వరుస ఓటమిలు చెందిన క్యాడర్ చెక్కుచెదర లేదు. మాజీ ఎంఎల్ఎ మదన్‌లాల్ వైరా నియోజక వర్గానికి ఇంచార్జిగా వ్యవహరిస్తూ గెలిచినా, గెలవకపోయినా ఐదు మండలాల పరిధి లోని ప్రజలతో నిత్య సంబంధాలను కొనసాగించే వారు. ఆయన మే మాసంలో మరణించిన తర్వాత ఇప్పుడు కారు పార్టీ పరిస్థితి స్టీరింగ్ లేని కారులా తయారైంది. ఇంజన్ సహా అన్ని మంచిగా ఉండి స్టీరింగ్ లేకపోతే కారు పరిస్థితి ఎలా ఉంటుందో నియోజక వర్గ ఇంచార్జి లేకపోవడంతో వైరా కారు పార్టీ పరిస్థితి అదేవిధంగా తయారైంది. మదన్ లాల్ మరణించిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ వైరా నియోజక వర్గానికి ఇంచార్జిని నియమించ లేదు. నియోజక వర్గ పార్టీ క్యాడర్ మదన్‌లాల్ కుటుంబం నుంచి ఒకరికి అవకాశం కల్పించాలని కోరుతుండగా ఇదే సమయంలో వైరా నుంచి తొలిసారి గెలిచిన

మిగతా 2లో..

# సమరశీల ఉద్యమాల వేదిక ఏఐఎస్ఎఫ్

**-స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశ చరిత్రలో ఎందరో త్యాగధనులను అందించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివ రామకృష్ణ, మాజీ రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, ఓరుగంటి శేషగిరిరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ, పిజి కళాశాల, శాంతినగర్, మహిళా డిగ్రీ కళాశాలల ఎదుట ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రావి శివరామకృష్ణ మాట్లాడుతూ అలుపెరుగని సమరశీల ఉద్యమాల వేదిక, దేశానికి ఎందరో త్యాగధనులను అందించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమ వారసత్వంతో విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ దే అన్నారు. 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఏర్పాటు కాబడి నేటికి 89 సంవత్సరాలు పూర్తి చేసుకుని

మిగతా 2లో..

# కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి..!



**-500 ఎకరాల ప్రభుత్వ భూమి మాయం**
**-కాస్రాలో ఉన్న భూమి... భూభారతిలో లేదు**
**-ప్రభుత్వ భూమికి పక్కనే ఉన్న పట్టా నంబర్‌తో రిజిస్ట్రేషన్లు**
**-దొడ్డిదారికి అధికారుల అండదండలు**
**-వంత పాడుతున్న రాజకీయ నేతలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేదవాడికి అడుగు భూమి ఇవ్వాలంటే సవాలక్ష సాకులు చెప్పే అధికారులు బడాబాబులు, భూస్వాములకు వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని కట్టబెడుతున్నారు. తాజాగా ఈ సంఘటన సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవిన్యూలోని గంగారంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి విశ్వసనీయ వ్యక్తుల కథనం ఈ విధంగా ఉంది.... గంగారంలోని ప్రభుత్వ సర్వే నంబర్లు 40,131 లోని దాదాపు 500 ఎకరాలు కబ్జాకు గురైంది. పక్కనే ఉన్న 133 పట్టా నంబర్ తో బడాబాబులు దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఈ విధంగా దొడ్డి దారిలో పాస్ బుక్కులు సాధించిన ఇద్దరు వ్యక్తులు నాది అంటే నాది అంటూ బాహా, బాహీకి దిగారు. దీంతో తీగలాగితే డొంక కదిలినట్లుగా ఈ ప్రాంతంలో ఏర్పడ్డ చీడపీడలు మొత్తం వెలుగులోకి వచ్చాయి. లోతుగా వెళ్ళి పరిశీలించగా ప్రభుత్వ సర్వే నంబర్లకు చెందిన దాదాపు 500 ఎకరాల విలువైన భూమి వైట్ కాలర్స్ చేతుల్లోకి వెళ్ళినట్లుగా సామాజిక వేత్తలు అంటున్నారు. కబ్జా వెనుక

మిగతా 2లో..

# వైరాలో స్టీరింగ్ లేని కారు పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఎంఎల్ఎ బానోత్ చంద్రావతి సైతం నియోజక వర్గ బాధ్యతలను నిర్వహించేందుకు పలుమార్లు పార్టీ అధిష్టానం ముందు సంసిద్ధత వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా మదన్‌లాల్ సతీమణి బానోత్ మంజుల క్యాడర్‌తో తరచూ సమావేశమవుతూ వారి బాగోగుల గురించి తెలుసుకుంటున్నారు. ఇటీవల కాలంలో మంజుల పార్టీ కుటుంబాలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు వారిని పరామర్శిస్తూ పార్టీ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మదన్‌లాల్ మరణించి మూడు మాసాలు గడుస్తున్నా పార్టీ అధిష్టానం ఇంత వరకు ఇంచార్జిని నియమించ లేదు. బిఆర్ఎస్ పార్టీలో ఇప్పటికే నేతల మధ్య సఖ్యత లేదని ఎవరికి వారుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు తప్ప ఉమ్మడి కార్యాచరణ లేదన్న ఆరోపణలు వినవస్తున్న నేపథ్యంలో మంజుల పర్యటనలో పాల్గొనవద్దంటూ కొందరు హుకుం జారీ చేస్తున్నారని ఇది సరైంది కాదన్న వాదన వినపడుతుంది. మాజీ శాసన సభ్యురాలి సతీమణిగా, మాజీ ప్రజాప్రతినిధిగా మంజుల పార్టీ కుటుంబాలను పరామర్శిస్తే తప్పేంటని మదన్‌లాల్ అనుకూలురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇంచార్జి నియామకానికి సంబంధించి రెండు వర్గాల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఇంచార్జి నియామకం వాయిదాపడుతూ వస్తుందని పార్టీలో కొందరు నేతలు వాపోతున్నారు. 2018, 2023లోనూ పార్టీకి నష్టం చేసి ఇతర పార్టీలకు ఓట్లు వేసిన వారిని కొందరు జిల్లా నేతలు ప్రోత్సహిస్తున్నారని వారితో కలివిడిగా ఉంటూ అసలు పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. 2018లో స్వతంత్ర అభ్యర్థికి 2023లో కాంగ్రెస్ అభ్యర్థికి పనిచేసిన ఓ నాయకున్ని నియోజక వర్గ ఇంచార్జిగానియమించేందుకు బిఆర్ఎస్‌లోని ఓ వర్గం ప్రయత్నిస్తుందని ఆ క్రమంలోనే ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. మాజీ ప్రజాప్రతినిధి కుటుంబానికి చెందిన కొందరు అతన్ని ఎంపిక చేయాలని జిల్లా నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నారని అవినీతి కేసుల్లో ఉన్న ఇంకా రాజకీయ ఆశ చావలేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులను సమీకరించి కేసిఆర్, కేటిఆర్ దృష్టికి పార్టీ వ్యవహారాన్ని తీసుకెళ్లాలని భావిస్తున్నారు. పార్టీ కోసం పనిచేసే వారిని కాకుండా పార్టీకి నష్టం చేసే వారిని ప్రోత్సహించడం పార్టీ నేతలకు తగదని వారు అంటున్నారు. మొత్తంగా ఈ స్టీరింగ్ లేని కారు ఏ వైపుకు వెళ్తుందో వేచి చూడాలి.

# కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి..!

(మొదటిపేజీ తరువాయి)

అసలు కథ ఇది బేతుపల్లి రెవెన్యూ లోని గంగారం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ సర్వే నెంబర్ 40 లో ఖాస్రా ప్రకారం 446 ఎకరాలు ఉండాల్సి ఉంది. మరో ప్రభుత్వ సర్వే నెంబర్ 131 లోను 292 ఎకరాలు ఖస్రాలో కనిపిస్తుంది. దీనికి సరిహద్దుగా 3089 ఎకరాల విస్తీర్ణం కలిగిన 133 పట్టా సర్వే నంబర్ కూడా ఒకటి ఉంది. పైన పేర్కొన్న రెండు ప్రభుత్వ సర్వే నంబర్లలోని భూములు ఆక్రమించుకున్న వ్యక్తులు దొడ్డి దారిలో అధికారుల అండతో 133లో ఉన్నట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పాస్ బుక్కులు పొందినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.



### ఇద్దరు వ్యక్తుల నడుమ ఘర్షణ...

కేవలం 3089 ఎకరాలు మాత్రమే కలిగిన 133 సర్వే నంబర్ పట్టేదారుడు 1995 నాటికి దాదాపు 1000 మందికి పైగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. అప్పటికే 133లో భూమి మొత్తం క్రయ,విక్రయాలు జరగగా, ఈ సర్వేబర్లో తనకు 300 ఎకరాలు ఉందని అందుకు రిజిస్ట్రేషన్, పాస్ బుక్ ఉందని వాదిస్తూ ఇటీవల మంది మాగదులతో పెద్ద ఎత్తున హైదరాబాద్ కు చెందిన వాసిరెడ్డి గాంధీ కుటుంబ సభ్యులు ప్రదేశం పైకి వచ్చారు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న వేంసూరు మండలం దుద్దేపూడికి చెందిన మోరంపూడి కుటుంబ సభ్యులు కూడా భారీ సంఖ్యలో ఆ ప్రదేశానికి చేరుకున్నారు. దీంతో రెండు వర్గాల నడుమ తీవ్రమైన ఘర్షణ వాతావరణం ఏర్పడే ప్రమాదమున్నదని తెలుసుకున్న గ్రామస్తులు కొందరు అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాస్తవ్యులు అక్కడి నుండి నెమ్మదిగా జారుకున్నారు. రెండవ వర్గం వారు సాయంత్రం వరకు ఉండి వాళ్ళు వెళ్ళిపోయారు. ఈ విధంగా ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్న అనేక మంది 133లో పాస్ బుక్కులు సాధించి ప్రభుత్వ సర్వే నంబర్ల పైకి రావటం పేద వర్గాలను ఆందోళనకు గురిచేస్తుంది. దాదాపు 500 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనప్పటికి అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవటంతో ప్రజాసామ్య వాదుల్లో అనుమానం వ్యక్తమవుతుంది.

### ఖాసాకు భూభారతి నడుమ భారీ తేడా...

ఖాస్రా పహణిలో 3089 ఎకరాలుగా నమోద్దై ఉన్న 133వ సర్వే నంబర్ భూభారతిలోకి వచ్చే సరికి 3146 కు చేరింది. అదే విధంగా ఖాస్రాలో 613 ఎకరాలు ఉండాల్సిన 40వ ప్రభుత్వ సర్వే నంబర్ భూభారతికి వచ్చే సరికి 446కు పడిపోయింది. ఇదిలా ఉండగా 292 ఎకరాలు ఖాస్రాలో కనిపిస్తున్న 131వ ప్రభుత్వ సర్వే నంబర్ లో భూభారతికి వచ్చే సరికి 230 కి చేరింది. ఈ విధంగా ఖాస్రా పహణి, భూభారతి నడుమ ఇంత వ్యత్యాసం కనిపిస్తున్నప్పటికి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో సామాజిక వేత్తలు పెదవి విరుస్తున్నారు.

### పాస్ బుక్కులో తక్కువ ...

సాగులో ఎక్కువ రిజిస్ట్రేషను సర్వే నంబర్ గా చెప్పబడుతున్న 133లోని అనుభవదారుల సాగు పరిశీలిస్తే ఆసక్తి కరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఈ సర్వే నెంబర్ లోని ముప్పావు వంతు అనుభవదారుల పాసు బుక్కుల్లో రెండు లేదా మూడు ఎకరాలుగా నమోద్దై ఉంటే, సాగులో ఆరు నుండి పది ఎకరాల వరకు కనిపిస్తుండడం విశేషంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఈ మొత్తం వ్యవహారం పై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని ప్రజాసంఘాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇప్పటికే ఆ ప్రదేశంపై దృష్టి పెట్టిన బిజెపి నాయకత్వం ఇక్కడ జరుగుతున్న అన్యాయంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లతోపాటు జాతీయ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రం నుండి సర్వే బృందం రాకపోతే కేంద్రం నుండి దర్యాప్తు బృందాన్ని తీసుకొస్తామని ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వర రావు, నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు గట్టిగా చెప్తున్నారు.

# శిశు మరణాలు అరికట్టడం అందరి బాధ్యత

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా పరిధిలో శిశు మరణాలు రేటు తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ శర్మతో కలిసి శిశు రమణాల పర్యవేక్షణ, ప్రతిస్పందన కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడాది పాటు జిలాల్లో నమోదైన 07 శిశు రమణాలపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు,జిల్లా వైద్యాధికారులు, వైద్య నిపుణులు, ఫీల్డ్ సిబ్బంది సమగ్ర సమీక్ష నిర్వహించారు. మరణాలకు గల కారణాలను విశ్లేషించి ఇలాంటి సంఘటనలు పునరా వృతం కాకుండా సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించి కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ ప్రాణం చాలా అమూల్యమైందని, సమయానికి తీసుకునే జాగ్రత్తలు శిశువుల ప్రాణాలను కాపాడగలవని ఆయన అన్నారు. మహిళలు గర్భందాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యేంత వరకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు సమయానికి చేయించుకునేలా గ్రామస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తరుచు పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. రక్తహీనత నివారణకు అవసరమైన పౌష్టికాహారంతో పాటు మందులు అందిస్తుండాలని, అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారంపై మార్గదర్శకాలు అందించడంతో పాటు గర్భిణీల నమోదు, ఆరోగ్య వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, హై రిస్క్ గర్భిణీలకు ప్రత్యేక పర్యవేక్షణ, సమయానికి వైద్య సేవలు అందించాలన్నారు. గిరిజన, గొత్తికోయ ప్రాంతాల్లో పిల్లల ఆరోగ్యం తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రధానంగా నమోనియా పై అవగాహన కల్పించేందుకు వారికి అర్ధమయ్యే రీతిలో వీడియోలు, కార్యక్రమాలను రూపొందించాలని ఆదేశించారు. సమావేశం అనంతరం టిబి నివారణ, అవగాహన కోసం రూపొందించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి జయలక్ష్మీ, మహిళా, శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనిన, వైద్య నిపుణులు,వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సారు నిద్రపోయారు.. పిల్లలు ఇంటికెళ్లారు

(మొదటిపేజీ తరువాయి)

నానంబొట్టు అన్న చందంగా తయారైంది. ఇప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయులు కొందరు విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తుండగా మరికొందరు మాత్రం అబాసుపాలు చేస్తున్నారు. మంగళవారం అనంతగిరి మండల పరిధిలోని చింతలపాడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు మిట్ట మధ్యాహ్నం గాఢ నిద్రలోకి వెళ్లగా విద్యార్థులు ఇక మనసారు లేవడులే అనుకుని ఇంటికెళ్లారు. పాఠశాల మధ్యాహ్నానికే విద్యార్థులు లేక ఖాళీ కాగా ఉపాధ్యాయున్ని ఎవరో లేపితే లేచారు. అప్పటికే జరగాల్సింది జరిగి విద్యార్థులు ఇండ్లకు వెళ్లిపోయారు. హాజరుపై చర్యలు తీసుకుంటున్నారని కొందరు పాఠశాలకు వచ్చి ఈ రీతిగా వ్యవహరిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పాఠశాలకు సరిగ్గా రాకపోవడం వచ్చినా విద్యా బోధన చేయకపోవడం చేస్తున్నప్పటికీ అధికారులు వీరిని పట్టించుకునే స్థితిలో లేరు. ఇప్పటికైనా ప్రభుత్వ బడులను నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాలకు వచ్చి గాఢంగా నిద్రపోయిన ఉపాధ్యాయుడు నగేష్‌పై తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పూర్తి వ్యవసాయ నేపథ్యం కలిగిన గ్రామం కావడంతో తల్లిదండ్రులు అందరూ వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లారు. బావులు, కుంటల వైపు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

# సమరశీల ఉద్యమాల వేదిక ఏఐఎస్ఎఫ్

(మొదటిపేజీ తరువాయి)



90వ వసంతంలోకి అడుగుపెట్టిన సుదీర్ఘ ఉద్యమ చరిత్ర కలిగిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్‌దే అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవాగ్నిని రగిలించిన నిప్పుకణం, చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అన్న నినాదంతో విద్యా రంగ పరిరక్షణ కోసం బహుముఖ పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందని రాష్ట్ర మాజీ నాయకులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు, స్కాలర్ షిప్పుల కోసం అనేక పోరాటాలు నిర్వహించినది, మహిళలపై జరుగుతున్న దాడులకు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించింది ఏఐఎస్ఎఫ్ అని ఐవిఎల్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలకు ఊడిగం చేస్తూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కుట్రలు చేస్తుందని, ప్రైవేటు యూనివర్సిటీల బిల్లును తీసుకు వచ్చి ప్రభుత్వ విశ్వ విద్యాలయాల వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఎందరో మేధావులను దేశానికి అందించిన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు ఇంద్రసేన, మదుపల్లి లక్ష్మణ్, నాగులమీరా, మధు, శివ, సాయి చైతన్య, గోపి, ఆకాష్, సంతోష్, శ్రీకాంత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, అలాంటి గ్రంథాలయాల పితామహునిగా పిలువబడే ఎస్ఆర్ రంగనాథన్ 113వ జయంతిని జరుపుకోవడం గర్వకారణమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నూతన గ్రంథాలయంలో రంగనాథన్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల్లో వర్గీకరణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి పుస్తకాల వర్గీకరణను సులభతరం చేసిన ఆయన సేవలు మరువలేనివి అన్నారు. గ్రంథాలయాల నిర్వహణలో గ్రంథపాలకులు ఎనలేని సేవలు అందిస్తున్నారని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారి కోసం ఎక్కువ సమయాన్ని వెచ్చించి శ్రమిస్తున్నారని చెప్పారు. రంగనాథన్ జయంతి సందర్భంగావారి సేవలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రంథాలయంలో పనిచేసిన గ్రంథపాలకులను శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్, విద్యార్థినీ విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# జిమ్ క్రీడాకారున్ని అభినందించిన ఎంఎల్ఏ



ప్రజాపక్షం/భద్రాచలం : కేరళా రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారుపతకాలు సాధించిన స్థానిక సిటి స్టైల్ జిమ్ క్రీడాకారుడు డివి శంకర్రావును ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ 73 సం. వయస్సు కాకుండా బైపాస్ సర్జరీ అయినప్పటికీ లెక్కపెట్టకుండా సిటి స్టైల్ జిమ్ కోచ్ రామిరెడ్డి, ఇంటెన్సివ్ ట్రైనర్ డా.శివరామకృష్ణ ప్రసాద్ శిక్షణలో ఆరు నెలల అనతి కాలంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో నాలుగు బంగారు పతకాలు సాధించారని, అక్టోబర్ నెలలో సౌత్ ఆఫికాలో జరిగే ఇంటర్నేషనల్ పవల్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. దేశ చరిత్రలోనే బైపాస్ అయిన వారు పవర్ లిఫ్టింగ్‌లో పాల్గొన్న దాఖలాలు లేవని, ఇది మెడికల్ మెరాకిల్ అని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బోగాల శ్రీనివాస్ రెడ్డి, ఎండి నవాబ్, రామసల్ల రాములు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజనుల అభివృద్ధి,అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జిసిసి కమీషనర్ కోట్నార్ తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక జిసిసి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, గోదాముల్లో ఉన్న సరుకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ గిరిజనాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత పాలకులు గిరిజన సహకార సంస్థను భ్రష్టు పట్టించారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జిసిసి బలోపేతంతోపాటు సిబ్బంది జీతాలు సకాలంలో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మున్నేటి విపత్తుపై అప్రమత్తం

**- ఏదులాపురంమున్సిపాలిటీకి చేరిన ఉపకరణాలు**
**- 12 వార్డులను వరద ముంపు ప్రాంతాలుగా గుర్తింపు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** గత మున్నేటి విపత్తుపై అధికారులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. అనూహ్యరీతిలో చేసిన విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఆదేశాల మేరకు ఆపద సమయంలో సహాయం అందేలా ఏదులాపురంమున్సిపాలిటీలో కంట్రోల్‌రూమ్‌తో పాటు టోల్‌ఫ్రీ నెంబర్ 9515685414, ఖమ్మంరూరల్ తహశీల్దార్ కంట్రోల్ నెంబర్ 8331930583 24/7 ఏర్పాటు చేశారు. మున్నేటి పరివాహక ప్రాంతంలోని 12వార్డులను వరద ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. వాటికి సెక్టోరల్ ఆఫీసర్స్‌గా వార్డ్ ఆఫీసర్స్,ఫీల్డ్ ఆఫీసర్స్‌తో టీములను నియమించారు.

**మున్సిపాలిటీకి చేరిన ఉపకరణాలు..**

వర్షాకాల నేపథ్యంలో ప్రభుత్వం బాధిత ప్రజలకు అండగా ఉండేందుకు రూ.1లక్ష50వేల విలువగల విపత్తు అప్రమత్తత పరికరాలను అందజేసింది. తెప్పలు, టార్చ్‌లు, హెచ్చరికమైకులు, స్విమ్‌సూట్‌తో పాటు తదిరత పరికరాలు మున్సిపాలిటీలో భద్రపరిచారు. ఆపదలో ఆదుకునేందుకు గజీతగాళ్లు, ప్రత్యేకవాహనాలను సైతం సిద్ధం చేశారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ టీమ్స్‌ను అవసరాన్ని బట్టి ఉపయోగించుకోనున్నారు. ఇప్పటికే తహశీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి 6పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మున్నేటి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహణను కల్పించారు.

**పుకార్లను నమ్మొద్దు : కమిషనర్, ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి**



ప్రజలు పుకార్లను నమ్మొద్దని, ప్రభుత్వం కల్పించిన కంట్రోల్ నెంబర్స్‌కి కాల్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. విపత్తు ప్రమాదం ఉంటే సైరన్‌లు అప్రమత్తత చేస్తాయన్నారు. అంతేకాకుండా అధికారులు హెచ్చరికల జారీ ఉంటుందన్నారు.

# విద్యార్థుల భవిష్యత్ కోసమే ఇన్స్పైర్ మైండ్స్ ఇగ్నైట్

**ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యార్థుల చదువుల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు భవిష్యత్ పట్ల స్పష్టమైన దిశానిర్ధేశం చూపించేందుకు ఇన్స్పైర్ మైండ్స్ ఇగ్నైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. మంగళవారం పాఠశాలల్లో ఇన్స్పైర్ ఇగ్నైట్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం కోసం హైద్రాబాద్ నుండి ప్రత్యేకమైన మోటివేషన్ స్పీకర్లను ఆహ్వానించి అశ్వారావుపేట ముస్లిం మైనార్టీ బాలికల పాఠశాల, ఎజిహెచ్ఎస్ బాలికల పాఠశాల, మద్దికొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇన్స్పైర్ మైండ్స్ ఇగ్నైటింగ్ సోల్స్ సభ్యులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, లక్ష్య సాధన భవిష్యత్ ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్య అనేది కేవలం పాఠ్య పుస్తకాల వరకే పరిమితం కాకండా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు మనసులో వెలుగు జ్యోతిని వెలిగించాలనే ఉద్ధేశ్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించిన సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటిడిఎ పిఓ వి.రాహుల్, మోటీవేషన్ స్పీకర్స్ జైపాల్, రంజిత, సుధాకర్, రామ్, శ్రవణ్, అయ్యప్ప, సురేంద్ర, నవీన్, ఖాసీం, ఎంఇఓ ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి కురిసిన వర్షానికి చెరువులకు అలుగులు





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** వరుణ దేవుడు కరుణిస్తే వర్షాలకు కొదవ లేనట్లు సోమవారం అర్ధరాత్రి మొదలైన వర్షం తెల్లవారుజామున ఏకదాటిగా భారీ వర్షం కురవడంతో రాత్రికి రాత్రే మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువు, వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని మొత్తం 40 గ్రామ పంచాయతీలు ఉండగా మండలంలో గీత గీసినట్లు కొన్ని గ్రామాలకు ఈ వర్ష ప్రభావం చూపించింది. సుబ్లేడు హస్నాబాద్, బచ్చోడు, జూపెడ, కాకరవాయి, బచ్చోడు తండా, రఘునాధపాలెం, పైనంపల్లి, సోలిపురం, రాజారం, బీరోలు, బంధంపల్లితో పాటు మరికొన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసినట్లు అక్కడి ప్రజలు వివరించారు. బీరోలు, బచ్చోడు, సుబ్లేడు చెరువులతో పాటు మరికొన్ని చెరువులు పూర్తిగా నిండి అలుగులు పోతున్నాయి. కొన్ని రహదారులకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాకాలం మొదలైన అప్పటి నుంచి ఇంత భారీ వర్షం కురవలేదని ప్రజలు భావిస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన లాంటి వర్షం ఇప్పుడు కురిసిందని భావిస్తున్నారు. రహదారుల రాకపోకలను వాగులు వెంట గ్రామపంచాయతీ ట్రాక్టర్లు పెట్టి దారి మళ్లించారు. కాంగ్రెస్ నాయకులు రామ సహాయం నరేష్‌రెడ్డి, ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్, మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారామ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రాజ్‌కుమార్ ఈ వరద ఉధృతిని పరిశీలించి ప్రజలకు తగు సూచనలు చేశారు.

# రహదారిని విక్రయించిన వ్యక్తిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** గత 24 సంవత్సరాలుగా వ్యవసాయ భూమిని నమ్ముకుని ఆ భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేద గిరిజన రైతుపై ఓ భూస్వామి దౌర్జన్యంగా బెదిరిస్తూ వ్యవసాయ భూమి రహదారిని ఆక్రమించుకుని వేరే వ్యక్తికి విక్రయించిన సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గోల్‌తండా గ్రామానికి చెందిన బానోత్ ప్రసాద్ పాతర్లపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 305/అ1లో రెండు ఎకరాల భూమిని గత 24 సంవత్సరాల క్రితం చంద్రుతండాకు చెందిన ఓ రైతు వద్ద కొనుగోలు చేశాడు. అప్పటి నుండి ఆ భూమిని వివిధ పంటలు సాగు చేసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పక్క గట్టు అయిన జల్లేపల్లి గ్రామానికి చెందిన పోట్ల భిక్షమయ్య మా వ్యవసాయ పొలానికి వెళ్లే రహదారిని మా పక్క గేటులో కొంత ప్రభుత్వ నీరు ప్రవహించే కాల్వ ప్రభుత్వ భూమి అయినా గుట్టను ఆక్రమించుకుని చదును చేసి జల్లేపల్లి గ్రామానికి చెందిన వారికి విక్రయించినట్లు సమాచారం. ఇటీవల నా వ్యవసాయ భూమిలో మోటార్ పైపులు అమర్చగా వాటిని సైతం ధ్వంసం చేసినట్లు తెలిపాడు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదని మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. పరిశీలించిన తహశీల్దార్ లూథర్ విల్సన్ త్వరలోనే భూమిని సందర్శించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపినట్లు బాధితులు వివరించారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని రేణుకాచౌదరి క్యాంపు కార్యాలయంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణకాచౌదరి చొరవతో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ముఖ్య అనచరుడు జవ్వాజి ఆనందరావు మంగళ వారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి సహకారంతో మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందిసున్నట్లు తెలిపారు. మధిర మండలానికి చెందిన కోమటి శ్రీనివాసరావుకు రూ.60వేలు, పార్శపు రాణికి రూ. 27,500 చెక్కులు మంజూరు కాగా వాటిని అందించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కర్లపూడి అప్పారావు, దోర్నాల వెంకట రవి, మండల నాయకులు ఆవుల గురుబ్రహ్మం జల్లేపల్లి ప్రసాద్, బాదా సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూరపాటి సత్యనారాయణకు లింగాల నివాళి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలం మల్లారం గ్రామానికి చెందిన కూరపాటి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు,, కల్లూరు జెడ్పిటిసి కట్టా అజయ్‌బాబు, బిఆర్ఎస్ మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, రైతు నాయకుడు చావా వేణుబాబు, కౌన్సిలర్ అప్పారావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు సాగుచేస్తున్న పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. మంగళవారం బోనకల్ గ్రామంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఆయిల్ ఇంజన్లతో పోలంలోని వర్షపు నీటిని బయటకు తీస్తున్న రైతులతో మాట్లాడి పంట నష్ట అంచనాను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ పత్తి, వరి పంటలు అకాల వర్షంతో నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను సత్వరమే ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటల నష్టం అంచనా వేయాలని అన్నారు. ఈ సంవత్సరం రుతుపవనాలు సకాలంలో వచ్చి వ్యవసాయానికి అనువుగా ఉందని సంతోషించే లోపే, అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఆకెన పవన్, టిఆర్ఎస్ మండల నాయకులు యార్లగడ్డ రమేష్, రైతులు మరీదు నాగేశ్వరరావు, మంద రాము తదితరులున్నారు.

# బిసిల రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్న బిజెపి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు పరిచేందుకు బిజెపి ప్రభుత్వం బిల్లును వ్యతిరేకిస్తుందని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మండల కేంద్రం ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వృత్తి సంఘాల జిల్లా నాయకులు రాములు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అమలుకు సామాజిక న్యాయానికి కుల గణనకు బిజెపి అడ్డుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హన్మంతరావు, దూదిగం బసవయ్య, ఆంగోత్ వెంకటేశ్వర్లు, సగుర్తి సంజీవరావు, నాగులవంచ వెంకటరామయ్య, షేక్.నాగుల్‌మీర, కూడల్లి నాగేశ్వరరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన రామిశెట్టి అచ్చమ్మకు మంజూరైన రూ.25వేల విలు వగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. సదరు లబ్ధిదారురాలు అనారోగ్య ఖర్చుల నిమిత్తం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా లభించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంపటి సురేందర్, దండి రంగారావు, 29వ డివిజన్ అధ్యక్షుడు వెంపటి రాము, బుద్ధి రాధకృష్ణ, నాగేశ్వరరావు, వీరనాగులు, తమ్మనబోయిన కర్ణ, నలబోలు ఉపేందర్‌రెడ్డి, 29వ డివిజన్ ఏఐవైఎఫ్ అధ్యక్షుడు మిర్యాల నరుణ్‌తేజ్, సభ్యులు అక్కినపల్లి దేవయ్య, మేళ్లచెర్వు నరేష్, బుద్ధి అప్పారావు, చింతల ఉదయ్, బన్నీ, అనీల్, మహిళ సమాఖ్య సభ్యులు కొత్త రమాదేవి, ఎర్రబాటి మమత, నలబోలు అనిత, బుద్ధి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళ పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం శేషగిరి నగర్ గ్రామం చేపల మార్కెట్ 11,12 వ వార్డులో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పేదవారి కల నెరవేర్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంలో పట్టా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల కృష్ణ, రహీం పాషా, మహేష్, సీనియర్ నాయకులు పాయం సూరయ్య, ప్రసాద్ శ్రీను, హసీనా, వార్డ్ ఆఫీసర్ ఝాన్సీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## లైఫ్ కేర్ హాస్పిటల్ ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని, అందుబాటు ధరల్లో అందించాలన్నారు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. మంగళవారం పట్టణంలోని కాకర్లపల్లి రోడ్ లో ఓల్డ్ కిడ్స్ కేర్ హాస్పిటల్ నందు డా.షేక్ ఖాసీం నూతనంగా ఏర్పాటు చేసిన లైఫ్ కేర్ హాస్పిటల్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సీనియర్ నాయకులు చలసాని సాంబశివరావు, చల్లగుళ్ళ నరసింహారావు, పసుమర్తి చందర్‌రావు, కమల్ పాషా, దేవగిరి అక్కిరెడ్డి, వెంకటరెడ్డి, నరేందర్ రెడ్డి, పువాళ్ళ పింగుల సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో అధికారుల నిరసన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణిలో జరుగుతున్న పిఆర్‌పి చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సింగరేణి అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తూ మంగళవారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్బంగా సింగరేణి అధికారుల సంఘం నాయకులు మాట్లాడుతూ సింగరేణి అధికారుల సంఘం పిలుపు మేరకు జే.వి.ఆర్ సి.హెచ్.పి లో సీ.ఎం.ఓ.ఏ.ఐ కొత్తగూడెం ఏరియా జాయింట్ సెక్రటరీ ఆలుగోలు ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సింగరేణి అధికారుల వేతనాల్లో భాగమైన పి.ఆర్.పి చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యాన్ని, ఫ్రీ ఎలక్ట్రిసిటీ చార్జెస్, ఐఐటి, ఐఐఎం ఫీజు రియంబర్స్మెంట్ వర్తింపు దీర్ఘకాలిక పదోన్నతులు ఇతర సమస్యలు పరిష్కరించాలని సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో అధికారులు సుదీర్ఘకాలంగా పోరాడుతున్నామన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సీ.ఎం.ఓ.ఏ.ఐ నాయకులు, సత్తుపల్లి జే.వి.ఆర్ సి.హెచ్.పి అధికారులు పాల్గొన్నారు.

## కొత్త పెన్షన్స్ వెంటనే మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వ అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని ప్రగతి శీల యువజన సంఘం ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కారేపల్లిలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ దరఖాస్తులు చేసుకొని, కార్యాలయాల్లో కొత్త పెన్షన్స్ మంజూరు కోసం వేలాది మంది అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చక ఓటమి పొందారని వారిలాగా కాకుండా అర్హులైన వారికి పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఖమ్మంరూరల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియామకం జరిగింది. అధ్యక్షుడిగా మల్లెల వీరన్న, ప్రధానకార్యదర్శిగా తొర్రికొండ రవి, కోశాధికారిగా ఎస్‌కే గౌస్‌మీయా, గౌరవాధ్యక్షులుగా పెరుమాళ్లపల్లి రమేష్‌బాబు, కొండపర్తి రంఘురాం, గౌరవసలహాదారులుగా రామ్మూర్తి, బోయిన సంగయ్యలతో పాటు పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నీరుడు తిరుపతిరావు, రఘు, బాబా, ఉస్మాన్, ఆరెంపుల మస్తాన్, లాస్య, అంజి, శివ, లక్ష్మణ్, రాజా, బచ్చలకూరి వెంకటేష్, రవి, సురేష్, మధు, వంశీ, గోపి, నరేష్, వేణు, గోపి, మహేష్, సాయి, వకీల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్

**ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ, ఆవిర్భావ వేడుకలు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆ సంఘం 90వ, ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని రాహుల్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆవిర్భావ సభలో రాహుల్ మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకుల చెర నుండి భరతమాత విముక్తి కోసం విద్యార్థులందరిని ఒక్క తాటిపైకి తీసుకొని రావటానికి ఉత్తరప్రదేశ్ లక్నో నగరం బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12 అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భంచినదని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నుండి నేటి వరకు సమరశీల ఉద్యమాలు కొనసాగిస్తున్న ఆ దేశ ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై కొట్లాడి సాధించుకొన్న తెలంగాణలో విద్య ఉపాధి హక్కుల సాధనకై పోరాటాలకు విద్యార్థి లోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో పేద, మధ్య తరగతి విద్యార్థులువిద్యకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని హెచ్చరించారు. కేవలం సంపన్న వర్గాలు మాత్రమే చదువుకునే రోజులు రాబోతున్నాయని అన్నారు. నూతన విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. దేశంలో పుట్టిన ప్రతీ బిడ్డకు సమానమైన విద్యను అందించాలని, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటి యాక్ట్ అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని, జిల్లాలో ఖాళీగా ఉన్నటువంటి ఎంఈఓ, ఉపాద్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రియెంబర్స్‌మెంట్స్‌విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సృజన్, నాయకులు రాజ్‌కమల్, శ్రీనివాస్, వినయ్, పవన్, అనిల్, రాకేష్, హరీష్, సతీష్, ప్రియాంక, రమ్య,రోజా, నిరోష, కవిత తదితరులు పాల్గొన్నారు.

# చంద్రుతండాలో పడకేసిన పారిశుద్ధ్యం..!

**-పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా గ్రామం**
**-మొక్కుబడిగా డిపిఓ గ్రామాల పరిశీలన**





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని చంద్రుతండా గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. గ్రామ పురవీధులన్ని బురదమయంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా ఉంటూ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలో డెంగ్యూ జ్వరం వ్యాపించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ జిల్లా వైద్యాధికారి కళావతిభాయ్ జిల్లాస్థాయి అధికారులంతా సందర్శించి గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పినప్పటికీ పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల గ్రామంలో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. గ్రామంలో సైడ్ కాల్వల్లో పూర్తిగా చెత్త చేరి వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతూ ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన కనీస రోజు వారీ కార్యక్రమాలు చేయటం లేదు. వారంలో ఒక్క రోజు శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు కూడా పూర్తిగా నిర్వర్తించటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. తడి చెత్త పొడి చెత్త సేకరణ పూర్తిగా మరిచారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సమయపాలన లేకుండా వస్తూ మధ్యాహ్నం సమయంలో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. గ్రామపంచాయతీపై జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆశాలత క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం దీనికి కారణమని గ్రామ ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గ్రామాలను సందర్శించి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫాగింగ్ యంత్రాలు మూలకు..దోమలు ఇళ్లకు..!

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** వర్షాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తి అధికమైంది. దీంతో నేలకొండపల్లి మండలంలోని ప్రజాలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలో 32 పంచాయతీలు ఉన్నాయి. మండలంలో 32 పంచాయతీలకు గాను ఫాగింగ్ యాంత్రలు చిన్నా మిషన్లు 15 పెద్ద మిషన్లు 1 ఉన్నాయి. ఫాగింగ్ యంత్రాలు కొన్ని పంచాయతీలో చెడిపోయి, మరమ్మతులు చేయకపోవడంతో మూలకు పడేశారు. నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో పెద్ద మిషను చెడిపోయి ఉంది. 32 గ్రామ పంచాయతీలకు గాను ఒకటే పెద్ద మిషన్ ఉండటం ఆశ్చర్యకరం. చిన్న గ్రామ పంచాయతీ లో నిధులు లేమితో ప్రక్కకు పెట్టారు. వర్షాకాలం కావడంతో గ్రామలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయకుండా యాంత్రలను మూలకు పడేవేశారు. వర్షాకాలం కావడంతో ఈగలు దోమల నివారణకు నెలకు రెండుసార్లు పాగింగ్ చేయాలి కానీ ఇంత వరకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయలేదు అని మండల ప్రజాలు వాపోతున్నారు.



# మున్సిపాలిటీ కార్మిక సంఘం (ఎఐటియుసి) నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన మున్సిపాలిటీ కార్మిక సంఘం ఏఐటియుసి కమిటీని మంగళవారం ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా వేము రాంబాబు, అధ్యక్షులుగా ఊడల కృష్ణ, ఉపాధ్యక్షులుగా గొల్లమండల యశోద, వజేర్మియా ప్రధాన కార్యదర్శిగా, చింతపల్లి శ్రీను కార్యదర్శిగా, కోశాధికారిగా కంభంపాటి ప్రకాష్, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, ప్రవీణ్, అంజలి, మరియమ్మ, రాంబాబు మరో 9 మందితో టు సలహాదారునిగా దామాల దయాకర్ రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అధ్యక్ష కార్యదర్శులు ప్రధాన కమిటీ తెలిపారుతెలిపారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**- పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి**
**- విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలి. కలెక్టర్**



**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ అన్నారు. పాఠశాలలో చేపట్టిన ప్రతీ అభివృద్ధి పనిని వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాల్వంచ నవభారత్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాలను మంగళవారం సంధర్శించారు. ఈ సంధర్భంగా జరగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ప్రవేశ ద్వారం నుండి డైనింగ్ హాల్, వసతి గృహం వరకు విద్యార్థులు, సులభంగా, సురక్షితంగా నడవటానికి పాత్‌వే నిర్మించాలని సివిల్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణం అందంగా, ఆహ్లాదకరంగా మారేందుకు చుట్టూ నీడనిచ్చే పెద్ద చెట్లు, వెదురు మొక్కలు నాటాలని, వాటితో పాటుగా వివిధ పండ్ల చెట్లు, ఔషద మొక్కలను ప్రణాళికాబద్ధంగా పెంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఉపయేగపడేలా మొక్కలను పెంచాలన్నారు. డైనింగ్ హాల్‌లో సౌకర్యవంతంగా ఉండేందుకు డైనింగ్ థ్నింగ్, కుర్చీలు ఏర్పాటు చేయాలని, వ్యర్థ పథార్థాల నిర్వాహణ కోసం కంపోస్ట్ పిట్స్ నిర్మాణం చేయాలని, తడిపొడి చెత్త వేరు చేసి వేసేందుకు ప్రత్యేక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మున్సిపాలిటి సహకారంతో పాఠశాల ఆవరణంలో మునగ, కరివేపాకు వంటి ఉపయేగకరమైన మొక్కలను నాటాలన్నారు. వాటి పెరుగుదలకు, సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సిఎస్‌ఆర్, సివిల్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ మైథిలి, ఇంజనీరింగ్, నవభారత్ కర్మాగారం అధికారులు పాల్గొన్నారు.

# తాలిపేరు పూడిక పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం





**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** తాలిపేరు కాలువ పూడిక తీయుటలో అధికార్లు జాప్యం చేయవద్దని అధికార్లుకు చూసించారు. మండలంలోని వీరభద్రారం, నడికుడి, సుబ్బారావు పేట గ్రామాల్లో జరుగుతున్న తాలిపేరు కాలువ పూడిక తీత పనులను మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావవు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికార్లుతో మాట్లాడుతూ పంట కాల్వాలో ఉన్న పూడిక పనులు సత్వరమే పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని ఆదేశించారు. నిదులు కొరత ఉంటే నిదేధిక అందిస్తే మంత్రి తుమ్మల దృష్టికి తీసుకు వెళ్లి నిధులు మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా పనులు పరిశీలించిన అనంతరం మార్గ మద్యలో పొలంలో నాటు వేస్తున్న కూలీలతో కలిసి వరి నాటు వేసారు. దీంతో కూలీలు హర్షవ్యకర్తం చేసారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ తెల్లం సీతమ్మ, మండల అధ్యక్షులు లంకా శ్రీనివాస రావు,నాయకులు అన్నెం సత్యనారాయణ మూర్తి, పిలక వెంకట రమణ, మట్టా వెంకటేశ్వరారావు, వర్ష చిన్నారావు, తెల్లం రామకృష్ణ, సోడి తిరుపతి రావు, కెల్ల శేఖర్, తోట రమేష్ పొడియం సుబ్బారావు, లంకా శివ, కొండ పల్లి నరేంద్ర, పాయం వెంకటేశ్వర్లు ఎస్కే ఖాదర్ పాషా, గజ్జల ముత్యాల రావు, బెర్రి ధర్మేందర్ తదితరులు పాల్గోన్నారు.

# చదువులో రాణిస్తూ, తల్లిదండ్రులకు తోడుగా నిలవాలి

**ఎమ్మెల్యే రాగమయి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రతి విద్యార్థి చదువులో ఉన్నతంగా రాణిస్తూ, కనిపెంచిన తల్లిదండ్రులకు తోడుగా నిలబడాలన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. మంగళవారం మండల పరిధిలోని కిష్టారంలో గల ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థినులకు ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు. అదే విదంగా నర్సింగ్ పరిక్షా ఫలితాల్లో 94% మార్కులు సాధించిన సందర్భంగా నర్సింగ్ విద్యార్థినిలు, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం కళాశాలలో ఎమ్మెల్యే డా.రాగమయి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, మండల పార్టీ అధ్యక్షుడు శివ వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, రాష్ట్ర మహిళా నాయకురాలు కుమారి, కమల్ పాషా, నరుకుళ్ళ అప్పారావు, తోట సుజల రాణి తదితరులు పాల్గొన్నారు.

# మధిర ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన బిజెపి నాయకులు




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం బిజెపి పార్టీ నాయకులు సందర్శించారు. ఆసుపత్రిలోని స్థితిగతులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ దవఖానా వైద్యులు సమయపాలన పాటించటం లేదని, కొందరు డాక్టర్లు ఉదయం ఆసుపత్రికి వచ్చి సంతకాలు పెట్టి ప్రైవేట్ క్లినిక్‌లతో డాక్టర్లు లాభ పడుతున్నారని ఆరోపించారు. వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధులైన విషజ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయగా ప్రస్తుత ప్రభుత్వంలో ఆసుపత్రిని ప్రారంభించటానికి వెనుకాడుతున్నారని, డిప్యూటీ సిఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క స్పందించి వందపడకల ఆసుపత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డాక్టర్లు సొంతంగా ప్రైవేట్ క్లినిక్‌లు ప్రారంభించి అధిక సంపాదనే లక్ష్యంగా పనిచేస్తూ పేదల ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పట్టణ అధ్యక్షులు శివరాజ్ సుమంత్, గడ్డం శ్రీహరిచౌదరి, జిల్లా నాయకులు చిలువేరు సాంబశివరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, పాపట్ల రమేష్, మండల నాయకులు పగడాల నాగేంద్రబాబు, దోర్నాల రవీందర్, బియ్యవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొని ఏఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘమని అన్నారు. నేడు విద్యా రంగా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తున్న రాష్ట్రంలో దేశంలో బలమైన సంఘంగా గుర్తింపు పొందిన ఇలాంటి సంఘంలో బాధ్యులుగా ఉన్నందుకు గర్వపడుతున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి నాగేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కొప్పుల, కత్తుల వినోద్ కుమార్, రాము, రఘు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించినది ఏఐఎస్ఎఫ్ అని, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్ పాషా పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఏఐఎస్ఎఫ్ శ్వేత అరుణ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చెర నుండి మాతృభూమి విముక్తికై 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావించి దేశ స్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి, ఎంతో మంది విద్యార్థులను త్యాగం చేసిందని కొనియాడారు. ఈ వేడుకల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పవన్, సాయి ధనుష్, రామ్ చరణ్, నవీన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేదు



**ప్రజాపక్షం/గుండాల :** మండలంలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయాదికారి బాబురావు అన్నారు. మంగళవారం మండల పరిదిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మంగలవారం ఆయన అకస్మిక తనికీలను నిర్వహించారు. దుకానాలలో, పిఏసిఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలించి ,పలు షాపుల్లో రికార్డులను పరిశీలించారు. శెంభునిగూడె, చెట్టుపల్లి గ్రామాలలో రైతుల మొక్కజొన్న పంటలను పరిశీలించి నాయో యూరియా వాడకం పై రైతులకు అవగాహణ కల్పించారు. ఇప్పటికే పిఏసిఎస్ ద్వారా 21452 యూరియా సంచులను రైతులకు అందచేయడం జరిగిందని, ప్రైవేటి డీలర్స్ ద్వారా 1006.58 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. వ్యవసాయాదికారివెంట ఏఒ వెకటరమణ, ఏఇఒలు లెనిన్, బాలరాజు ఉన్నారు.

## ఘనంగా ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/గుండాల :** మండల కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల విద్యార్థులతో కూడి విద్యార్థి శ్వేత చేతుల మీదుగా పతాకావిష్కరణ చేయగా ,ఆ సంఘ జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహెద్ ముఖ్య అధిదిగా పాల్గొని వరున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో షాహెద్ మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణస్వాతంత్రం కావాలని బ్రిటీష్ సామ్రాజ్య వాదుల చెరనుండి మాతృభూమి విముక్తికై 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావించి దేశస్వాతంత్రోద్యమంలో అసమాన పోరాటాలు నిర్వహించి , ఎంతో మంది విద్యార్దులు త్యాగాలు చేశారన్నారు. విద్యార్ది పరిరక్షణకై, శాస్త్రీయవిద్యా, కామన్ విద్యా విదానంకోసం ఎన్నాపోరాటాలను నిర్వహించిన చరిత్ర ఎస్ఎఫ్ఐకి ఉందన్నారు. ఈ వేడుకల్లో విద్యార్ది నాయకులు నాసీర్, పవన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సుల కోసం ప్రయాణికుల తిప్పలు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం పాత బస్టాండ్ అంబేద్కర్ నగర్ మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు కొత్త బస్టాండుల వద్ద బస్సుల కోసం కిటకిటలాడుతుంది. శ్రావణమాసం కావడంతో రద్దీ కనపడింది. బస్సులు సకాలం రాకపోవడంతో చాలీచాలని బస్సులు వలన అధిక సంఖ్యలో ఖమ్మం వైపు వెళ్లే ప్రయాణికులు గంటలు తరబడి చూడాల్సి వస్తుంది. ఒక బస్సు ప్లాట్ ఫామ్ మీదకు వస్తే రెండు బస్సులకు సరిపడా ప్రయాణికులు ఉన్నారు. బస్సు ప్రయాణం ఎటువైపున కిక్కిరిసి పోవడం మామూలు అయిపోయింది.

# కాల్వ కబ్జాతో శ్రీరామ్‌నగర్‌కాలనీకి వరద

- ఓ బిల్డర్ నిర్మించిన ఇంటితో మూతబడిన డ్రైనేజీ
- రెండురోజులుగా పోటెత్తుతున్న వరద
- సిపిఐ చొరవతో సమస్య పరిష్కరించిన అధికారులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** పంట కాల్వ ఆక్రమణకు పాల్పడితే వర్షాలతో కాలనీలు,రహదారిపై వరద నీరు చేరుతుండటం తెలిసిందే..కానీ రియాల్టర్ల, బిల్డర్ల ధనదాహంతో కబ్జాకు గురైన కాల్వతో వరంగల్‌క్రాస్ రోడ్‌లోని శ్రీరామ్‌నగర్(ఆటోనగర్) కాలనీ వాసుల అవస్థ పడుతున్నారు. అలాగే ఎన్ఎస్‌పీ అధికారులు కాల్వను అస్తవ్యస్థంగా వదిలేయడంతో పంట పొలాలను తడపాల్సిన నీరు వృథాగా పోతుంది. గత రెండురోజులుగా వరద నీరు చేరుతుండటంతో స్థానికి సిపిఐ పార్టీ చొరవతో ఏదులాపురంమున్సిపాలిటీ అధికారులు సమస్యను పరిష్కారం చేపించారు. తొలుత నీరు వెళ్లేలా చర్యలు చేపట్టి..తాత్కాలికంగా ఆక్రమణను తొలగించారు.

### 30 అడుగుల కాల్వ ఆక్రమణ..

రైతుల పంటపొలాలకు నీరందించే ఎనఎస్‌పీ ద్వారా 30 అడుగుల కాల్వను తీశారు. ఇది సాగర్ తూము నుంచి గొల్లగూడెం, శ్రీరామ్‌నగర్(ఆటోనగర్), వరంగల్‌క్రాస్‌రోడ్, పెద్దతండలోని శివంశంకర్‌గ్రానైట్ మీదుగా గుర్రాలపాడులోని పంట పొలాలకు నీరందిస్తూ మున్నేటిలో కలుస్తుంది. ప్రధానంగా ఈ కాల్వ శ్రీరామ్‌నగర్(ఆటోనగర్), వరంగల్ క్రాస్‌రోడ్, పెద్దతండపరిధిలో కాబ్జాకు గురైంది. రియల్ వ్యాపారులు కాల్వను కబ్జా చేసి, ఫ్లాట్లుగా చేయడంతో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో గుర్రాలపాడు రెవిన్యూలోని సుమారు 50ఎకరాల పంటల రైతులకు నీరందక గగ్గోలు పెడుతున్నారు. పంటలు ఎండిపోతున్నాయని, కాల్వను పునరుద్ధరించాలని ఎన్ఎస్‌పీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### కాలనీలోకి నీళ్లు..

రైతులకు సాగు నీరందించేందుకు గత రెండు రోజుల క్రితం సాగర్‌నీటిని విడిచారు. కాల్వ కబ్జా కావడంతో నీటి ప్రవహానికి అడ్డంకి ఏర్పడింది. దీంతో కాల్వకు ఎడమవైపు ఉన్న శ్రీరామ్‌నగర్(ఆటోనగర్) కాలనీలోకి వరద పోటేత్తింది. కాలనీలో ఓ బిల్డర్ డ్రైనేజ్ పైనే



అక్రమంగా ఇంటిని నిర్మాణం చేశాడు.ఈ నేపథ్యంలో పోటెత్తిన వరద అందులో గుండా వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రధాన దారితో పాటు, కాలనీలోకి వెలుతున్నాయి. అక్కడి ఖాళీ స్థలాల్లోకి నీరు పెద్ద ఎత్తున చేరడంతో చెరువును తలపిస్తున్నాయి. చిన్నగా మొదలై కాలనీలోకి నీరు చేరే స్థాయికి వచ్చాయంటే అటు తర్వాత ఏంటి పరిస్థితని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### బిల్డర్‌కు చెప్పినా వినలేదు : వెంకటేశ్వరరెడ్డి, కాలనీవాసి



డ్రైనేజ్‌ను మూసి వేస్తే నీరు ప్రవహించదని బిల్డర్‌కు చెప్పాను. నిర్మాణం చేస్తే అధికారులు కూలగొడతారన్నప్పటికి వినలేదు. పోతే పోతుంది పోయినప్పుడు చూద్దాం అంటూ ఇంటి నిర్మాణం చేశాడు.

### రోడ్డు కబ్జా కాకుండా చూడాలి: దండి రంగారావు, సిపిఐ నేత



ఏండ్లుగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కారం కాబోతుంది. ఈ క్రమంలో దారిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడితే అటు తర్వాత ఇబ్బందులు ఏర్పడతాయి. కావున అధికారులు కబ్జా కాకుండా చర్యలు తీసుకొని, అక్రమంగా వెలసిన నిర్మాణాలు తొలగించాలి.

# రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తం

**-సిపిఐ నిరసనతో స్పందించిన మున్సిపల్ కమిషనర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 16, 19 డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, కొద్దిపాటి వర్షానికే రోడ్లపై మురుగునీరు చేరి ఇండ్లలోకి ప్రవేశిస్తుందని దీనితో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నట్లు సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. సిపిఐ వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు ఆధ్వర్యంలో పార్టీ నగర సమితి సభ్యులతో 16, 19 డివిజన్లలో పర్యటించి నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారులు సత్వరమే రోడ్లపై నిలిచిన మురుగు నీటిని తొలగించాలని వారు డిమాండ్ చేస్తూ రోడ్లపై నాట్లు వేశారు. సిపిఐ నిరసనతో స్పందించిన కార్పోరేషన్ అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నగర కమిషనర్‌కు వివరించారు. సిపిఐ నేతలు నగర కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి సమస్యలు వివరించడంతో అందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర కమిషనర్ హామీతో స్థానిక ప్రజలు తమ నిరసనను విరమించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సిపిఐ నగర కార్పొరేటర్ బిజి క్లెమెంట్, ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు మాట్లాడుతూ నగర పాలక సంస్థ 16, 19 డివిజన్లలో అనేక ఏళ్ల నుండి



నివాసాలు ఏర్పాటు చేసుకుని నగర పాలక సంస్థకు అన్ని రకాల పన్నులను చెల్లిస్తున్నారని ప్రజల సమస్యలను విస్మరించడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, సిపిఐ నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య, రవి, రాంబాబు, రంగయ్య, శ్రీను, నర్సింహారావు, సామేలు, శ్రీరాం సాగర్, విష్ణుమూర్తి, నాగేశ్వరరావు, ఉపేందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగర సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు : మేయర్ నీరజ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగర సమగ్రాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ఖమ్మం నగర గాంధీచౌక్‌లో రూ.12లక్షలతో గణేష్ టెంపుల్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో నాణ్యమైన రహదారుల నిర్మాణానికి సమగ్ర చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. గాంధీచౌక్‌లో రూ. 2.25 కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రహదారి నిర్మాణానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 14న శంకుస్థాపన చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వహకులు అతిథులను ఆలయ సంప్రదాయ ప్రకారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ ఎ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, పూజారి భరద్వాజ, ప్రసాద్, గెల్లా కృష్ణవేణి, పసుమర్తి శివరామకృష్ణ, ఎ. రమేష్‌బాబు, శ్రీనివాసరావు, రమేష్, భాస్కర్‌రావు, వీరభద్రరావు, అర్వపల్లి రమేష్, విశ్వేశ్వరరావు, ఈశ్వర్‌రావు, రాంబాబు, పరబ్రహ్మం, నాగరాజు, దుర్గాప్రసాద్, కృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెటింగ్ శాఖ పెన్షనర్లకు జులై పెన్షన్లు చెల్లించండి

**-ఎస్‌జిపిఏటి డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలోని 32 వ్యవసాయ మార్కెట్ కమిటీలలోని పెన్షనర్లకు జులై పెన్షన్లు ఇప్పటి వరకు చెల్లించలేదని తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) ఖమ్మం జిల్లా యూనిట్ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఖమ్మంతో పాటు రాష్ట్రంలోని వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, సంగారెడ్డి, జనగాం, మహబూబాబాద్ తదితర 32 మార్కెట్ కమిటీ పెన్షనర్లు నేటి వరకు పెన్షన్లు అందలేదని సత్వరమే మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌జిపిఏటి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవి కుమార్ లు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా జూన్ పెన్షన్ కూడా పొందని వారిలో ఖమ్మం, భద్రాచలం, వేములవాడ, అచ్చంపేట మార్కెట్ కమిటీల పెన్షనర్లు ఉన్నారని ఎస్‌జిపిఏటి నాయకులు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మాదిరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీల పెన్షనర్లకు ట్రెజరీల ద్వారా పెన్షన్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

# గంజాయి కేసులో నిందితులకు 20 ఏళ్లు జైలుశిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** హైదరాబాద్‌కు చెందిన నాయిక్ మల్లేష్ (21), వై. రవితేజ (20) లకు గంజాయి కేసులో 20 ఏళ్లు కఠిన కారాగార శిక్షతో పాటు నిందితులకు రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయ అధికారి కె. ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. . 27.04.2021న నిందితులు భద్రాచలం దగ్గర మోతుగూడెంలో గంజాయిని కొనుగోలు చేసి కారులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలో వివిపాలెం వద్ద అతివేగంగా నడుపుతూ ఎదురుగా వచ్చిన ప్యాసింజర్ ఆటోను వేగంగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు. దీనితో నిందితులు కారులో ఇరుక్కోవడంతో పోలీసులు అక్కడకు చేరుకుని జేసిబి సహాయంతో వారిని బయటకు తీశారు. నిందితుల వద్ద ఉన్న 100 ప్యాకెట్ల గంజాయిని పట్టుకుని నిందితులపై ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అట్టి కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు ఎ. శంకర్, శరత్‌కుమార్‌రెడ్డి లు వాదించగా లైజనింగ్ అధికారి శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ రవికిషోర్, సాంబశివరావు, హోంగార్డ్ ఎండి అయూబ్ లు సహకరించారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ మధిర :** రానున్న 48గంటల్లో ఆతర్వాత కూడా తెలంగాణ రాష్ట్రంలో సరిహద్దు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడటం ద్వారా మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తుఫాన్ హెచ్చరికలు కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు మధిర, ఎర్రుపాలెం బోనకల్ మండలాల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర రూరల్ సిఐ డి.మధు కోరారు. కృష్ణనది పరివాహక ప్రాంతంలో ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలతో వచ్చే వరరద నీటి ద్వారా కట్టలేరు, మధిర వైరా నదులు వీటితో పాటు చెరువులు వరద నీరు వచ్చే ప్రభావం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అలాగే చేపల వేటకు, పశువులను నదులు, చెరువుల్లోకి తీసుకువెళ్లే వారు వాటికి దూరంగా ఉండాలన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ ఉపకరణాల వాడకానికి దూంరగా ఉండాలని, వరదనీటి ప్రవాహాల నేపథ్యంలో ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్న సందర్భంలో ఆయా మండలాల మండల అధికార యంత్రంగానికి, పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు రూరల్ సర్కిల్ పరిధిలోని మధిర రూరల్, బోనకల్, ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది విధి నిర్వహణ కార్యక్రమాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

# రైతు బీమా అనర్హుల జాబితా ప్రదర్శన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో రైతు బీమా అనర్హుల జాబితాను ప్రకటించినట్లు వ్యవసాయ శాఖ అధికారిని రూప తెలిపారు. మొత్తం రైతులు 22,000 మంది కాగా వారిలో ఇప్పటి వరకు 15వేల 490 మంది రైతులు ఆన్లైన్ కాగా ఇంకను అనర్హులు 6700 మంది ఉన్నారని, మరో కొంతమందికి కొత్త పాసు బుక్కులు, పాత పాసుబుక్కులు ఉన్నాయని అవన్నీ పరిశీలించి అర్హులు జాబితాలో అర్హులను ఆన్లైన్ లో పొందుపరుస్తున్నట్లు వారి పేర్కొన్నారు. 18 సంవత్సరాల లోపు 59 పైనవారు బీమాకు అనర్హులని ఏవో తెలిపారు. రైతులు గ్రామపంచాయతీలలో ఉన్న జాబితాను పరిశీలించుకొని అభ్యంతరాలను త్వరగా తెలపాలని కోరారు.

# పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య



**ప్రజాపక్షం/పెనుబల్లి:** గంగదేవిపాడు గ్రామంలో విషాదం నెలకొంది. పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెనుబల్లి మండలం గంగదేవిపాడు గ్రామానికి చెందిన దంతనపల్లి నాగరాజు (25) మంగళవారం మధ్యాహ్నా సమయంలో పురుగు మందు తాగి ఇంటి నుండి తన మిత్రుడుకి ఫోన్ ద్వారా పురుగు మందు తాగి చనిపోతున్నాను అని తెలపడంతో వెంటనే మృతుడు ఇంటికి వెళ్ళగా వాంతులు చేసుకుంటున్న మృతుడిని ద్విచక్ర వాహనంపై పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుంటాడు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తి స్థాయిలో తెలియరాలేదు. ప్రేమ వ్యవహారం అయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మాదకద్రవ్యాల నియంత్రణకు జిలాల్లో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, వాటి వలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం ఐడిఓసిలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిలాల్లో నమోదవుతున్న ఎన్డిపిఎస్ కేసులు, గంజా యి సాగు నివారణ చర్యలు, శాఖల వారీగా చేపట్టాల్సిన విస్తృత ప్రచా రం వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. జిలాల్లో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ పాఠసాలలు, వసతి గృహాల్లో, గురుకులాల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్యాధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి అవసరమైన చికిత్సలు అందించడంతో పాటు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. డి అడిక్షన్ సెంటర్ ద్వారా అవసమరైన చికిత్సలు చేయించాలన్నారు. అటవీ అధికారులు గంజాయి సాగు జరిగే ప్రదేశాలను గుర్తించాలని, అలాంటివి తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలు ప్రతినెలా తనిఖీ చేయాలని, డ్రగ్ ఇన్స్పెక్టర్లకు సూచించారు. ఇంటర్ కాలేజీల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల జిరేగ నష్టాల పట్ల అవగాహన కల్పించడానికి ఈ వారంలో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులు, యువత, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి కట్టడి చేయాలన్నారు. విద్యార్థుల అలవాట్లు, నడవడికలు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ నాగలక్ష్మీ , ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి జయలక్ష్మీ , రవాణా అధికారి వెంకట రమణ, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావుతో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్




**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** మంగళవారం ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం లో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్.కె ఫహీమ్ దాదా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ శ్వేతా అరుణ పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్ ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు12 న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించింద అన్నారు. 89సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటివరకు గల్లి నుండి ఢిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, సంజయ్ నవిత, సోబిత, ప్రణయ్, వంశీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, పారిశుద్ధంపై అధికారులు దృష్టిసారించాలి

**-16న ఏఐకెఎస్ పట్టణ మహాసభ**
**-సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**




**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో త్రాగునీటి సమస్య, పారిశుద్ధంపై అధికారులు ప్రేత్యేక ద్రుష్టి సారించి శాశ్వత పరిస్కారం చూపాలని, శంకుస్థాపనలు పూర్తయిన రోడ్లు, డ్రైన్లు, ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అధికారులను కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో మంగళవారం జరిగిన సిపిఐ కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడుతూ, వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధం లోపించి ప్రజలు అనారోగ్యం భారినపడే ప్రమాదం ఉందని తక్షణమే అధికారులు ప్రేత్యేక డ్రైవులు ముమ్మరంగా చేపట్టాలని, పట్టణంలో త్రాగునీటి సమస్య ఉన్న వార్డులు, బస్తీలను గుర్తించి సమస్యకు పరిష్కరించాలన్నారు. ఈనెల 16న కొత్తగూడెం పట్టణ ఏఐకెఎస్ మహాసభ నిర్వహిస్తున్నామని, పట్టణపరిధిలోని రైతులు పాల్గొనాలని సూచించారు. దీంతోపాటు యువజన, విద్యార్థి, గిరిజన సమాఖ్య, ఏఐటీయూసీ పట్టణ మహాసభలు నిర్వహించబోతున్నామని ఈ మహాసభలను ఆయా సంఘాల పట్టణ బాధ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి సభలను విజయవంతం చేయాలనీ సూచించారు. గెడ్డాడ నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, భూక్యా రమేష్, నిమ్మగడ్డ వెంకటేశ్వ్రరావు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలి

**డిఆర్డిఓ అడిషనల్ పీడీ శిరిష**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అవెన్యూ ప్లాంటేషన్ పనులలో నిర్లక్ష్యం ను సహించేది లేదని డీఆర్డీఓ అడిషనల్ పీడీ శిరిషా హెచ్చరించారు. మండలం లోని రాజేశ్వరపురం, అమ్మగూడెం పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా లోని అన్ని పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ లో భాగంగా మొక్కలు నాటే విధంగా కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రతీ పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది. లేదని హెచ్చరించారు. హెచ్చరించారు. ప్రతి వంద యత వచ్చటి ఆ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. నర్సరీలో మొక్కలు సంరక్షణ బాధ్యత గా తీసుకోవాలని అన్నారు. ప్రతీ మొక్క కు లెక్క ఖచ్చితంగా ఉండాలని సూచించారు. జిల్లాను ఆదర్శంగా ఉండేలా మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. ప్రతీ పంచాయతీ కి ఇచ్చిన లక్ష్యం ను నెరవేర్చాలని సూచించారు. మొక్కలు నాటటమే కాకుండా వాటిని రక్షించేందుకు వెంటనే కంచె ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నేలకొండపల్లి మండలం కు ఇచ్చిన టార్గెట్ 70 వేల మొక్కలను నాటాలని సూచించారు. వాటిలో 15 వేల అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు, 7,100 మొక్కలు రీప్లేస్మెంట్ మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అవెన్యూ ప్లాంటేషన్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఈజీఎప్ ఏపీవో ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్ జీ. నాగేందర్ పాల్గొన్నారు.

# కార్మిక వర్గ పక్షపాతి మహేంద్ర



**ప్రజాపక్షం/ఇల్లెందు :** కెవిల్ మహేంద్ర కార్మిక వర్గ పక్షపాతి అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ అదనపు ప్రధాన కార్యదర్శి కె సారయ్య అన్నారు. ఇల్లెందు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ఆధ్వర్యంలో కేవిల్ మహేంద్ర 18వవర్ధంతిని విఠల్ రావు భవన్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలూత యూనియన్ పతాకాన్ని అపాధ్యక్షులు దాసరి రాజారాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ సంపూర్ణ స్వరాజ్యం కోసం ఏఐటియూసి పిలుపులో భాగంగా స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న మహనీయుడని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నట్లు తెలిపారు. 1942వ సం.లో సిపిఐలో చేరి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరకొండ శంకర్, బందం నాగయ్య, బాసా శ్రీనివాస్, ఎండి నజీర్ అహ్మద్, దాసరి రాజారాం, బానోత్ బాలాజీ, నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, దాట్ల వెంకటేశ్వర్లు, యుగేంధర్, బొల్లెద్దులు శ్రీనివాస మంగపతి, వలీ, కిషోర్, రంజిత్, ఇబ్రహాం, రాజమొగిలి, వీరస్వామి, ముఖేష్ పాసి, కృష్ణ, లక్ష్మణ్ రావు, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ఇల్లెందు :** వైద్యం కోసం అప్పులు సప్పులు చేసి బాధపడుతన్న పేద వర్గాలను ఆదుకునేందుకు సిఎం రిలీఫ్ ఫండ్ అందిస్తోందని ఎంఎల్ఏ కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ 79మంది లబ్దిదారులకు గానూ రూ.19 లక్షల చెక్కులు వచ్చాయని తెలిపారు. ప్రజారోగ్యానికి పెద్దపీఠ వేస్తున్న ప్రభుత్వం పేద వర్గాలకు అండగా నిలబడుతోందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి మండల రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, నాయకులు బదుగు సాంబమూర్తి, దొడ్డా డానియేల్, పులి సైదలు,ఉ బోళ్ల సూర్యం, గందెం సదానందం, తాటి బిక్షం, మూతి కృష్ణ, ప్రసన్నకుమార్, కృష్ణప్రసాద్, ఈసం లక్ష్మణ్, బండి ఆనంద్, దండుగుల శివ, కల్తి పద్మ, పాయం స్వాతి, సుదర్శన్ కోరి, గాలిపల్లి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** నేడు( బుదవారం ) పట్టణ పరిధి అంబేద్కర్ సెంటర్లో వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా, దిష్టిబొమ్మల దహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్వంచ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబ పిలుపునిచ్చారు. స్థానిక చంద్రా రాజేశ్వరరావు భవన్లో సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ ప్రజాపంథా పార్టీల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సంధర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. . కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నా, మోడీ, అమిత్షా దిష్టి బొమ్మల దగ్గం కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి తులసీరామ్, సిపిఐఎంఎల్ మాస్లైన్ పట్టణ కార్యదర్శి రాయబారపు వెంకటేశ్వర్లు, రైతు, కార్మిక సంఘాల, మండల, జిల్లా నాయకులు ఇట్టి వెంకటరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, శనిగారపు శ్రీనివాసరావు, నిమ్మల రాంబాబు, నరహరి నాగేశ్వరరావు, కరీం, సత్యనారాయణ, కోరె క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్య పరిష్కరించండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** శివారు జగదీష్ కాలనీలోని ఎల్బిజి నగర్లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయితీ ఇఓకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విఓ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు గడ్డం స్వామితో కలిసి ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ గత పదినెలలుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడున్నారని అన్నారు. డ్రైనేజీ నిర్మాణం సందర్భంగా పైపులు తొలగించాలని, దీంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. నిర్మించిన డ్రైన్ కూడా అస్తవ్యస్తంగా ఉందని, దానిని సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం, సౌభాగ్యం, అనసూయ, భావని, రాణి, రమణ, చంద్రమ్మ, తిరుపతమ్మ.జానకి,సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో ఖమ్మం జిల్లా వైద్యశాఖ వారి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ప్రశాంత్, సాయిరెడ్డి రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తదితర ఆరోగ్య నియమాలను పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొగ్గుల లక్ష్మీ రెడ్డి, గోవర్ధన్రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కర్నాటి సుధాకర్రెడ్డి, రమేష్, బొగ్గుల సత్యనారాయణరెడ్డి, బూసుపల్లి జగన్మోహన్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేసేది ఏఐటియుసి



**ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు**
**వివిధ సంఘాల నుంచి**
**ఏఐటియుసిలో చేరిన మున్సిపల్ కార్మికులు**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేసేది ఏఐటియుసి మాత్రమేనని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు అన్నారు. మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఖమ్మం నగర కార్పోరేషన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు వివిధ కార్మిక సంఘాల నుండి ఏఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్ ఏఐటియుసి కండువాలు కప్పి కార్మికులను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మిక హక్కుల కొరకు, సమస్యల పరిష్కారం కొరకు గత 105 ఏళ్లుగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఏఐటియుసి కార్మిక సంఘాన్ని ఎంచుకుని అందులో వారు చేరడం అభినందించదగ్గ విషయమన్నారు. ఖమ్మం కార్పోరేషన్‌లో, జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై ఏఐటియుసి అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షురాలు సిహెచ్ సీతా మహాలక్ష్మి, నాగేంద్రబాబు, బాబురావు, యశోద, బివి చారి, కొలికి పొంగు ముత్తయ్యలు పాల్గొనగా బుర్రి ఉపేందర్, జి. మహేష్, ఐ. వెంకన్న, జానకిరాములు, తాళ్లపల్లి రాములు కన్వీనింగ్ కమిటీగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

# ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు కట్టుదిట్టంగా నమోదు చేయాలి

**-పాఠశాలలో బ్యాగ్ లెస్ డే నిర్వహించాలి**
**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు నమోదు కట్టుదిట్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా।। పి.శ్రీజ తో కలిసి ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు నమోదుపై విద్యాశాఖాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులకు సెలవు మంజూరు సమయంలో పాఠాలకు ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల, చదివే విద్యార్థుల పూర్తి వివరాలు ఎఫ్ఆర్ఎస్‌లో మూడు రోజుల్లో ఎన్‌రోల్ చేయాలన్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయులకు జారీ చేసిన డిప్యూటేషన్‌పై రివ్యూ నిర్వహించాలన్నారు. ఖమ్మం జిల్లాలో 1600 ప్రభుత్వ పాఠశాలల్లో 65వేలకు పైగా విద్యార్థులు చదువుతుంటే వీటిలో 237 పాఠశాలల్లో 56,300 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ 237 పాఠశాలల్లో ఎక్కడ టీచర్ కొరత రాకుండా చూడాలన్నారు. సాంక్షన్ పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని కలెక్టర్ మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మండలంలో ఉన్న హెడ్ మాస్టర్లకు ఎఫ్ఆర్ఎస్‌లో ఉన్న సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలకు విద్యార్థులు గైర్హాజరైతే రెగ్యులర్ ఫాలోఅప్ చేయాలన్నారు. టీచర్లు, విద్యార్థుల హాజరు అంశం అత్యంత ప్రాధాన్యతగా పరిగణించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆగస్టు చివరి నాటికి అపార్ నెంబర్ జనరేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే మెరిట్ విద్యార్థులను పిఎంశ్రీ ఫీల్డ్ విజిట్ క్రింద స్పెస్ స్టేషన్ తీసుకొని వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో ఒక రోజు బ్యాగ్‌లెస్ డేగా పెట్టాలని ఆరోజు పిల్లలతో గ్రూప్ డిస్కషన్, డిబేట్, క్రీడలు మొదలైన వివిధ కార్యక్రమాల అమలు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి నాగపద్మజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం : పాయం





**ప్రజాపక్షం/పినపాకః** అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభు త్వం పని చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన పినపాక మండలంలో పర్యటించారు. తోగ్గూడేం, పినపాక,బోటిగూడెం, ఉప్పాక గ్రామపంచాయతీలలో 52 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. తోగూడెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులను అడిగి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. అనంతరం పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐ టి సి అందిస్తున్న సైకిళ్లను ఐటీసీ యాజమాన్యం చెంగల్ రావు తో కలిసి గిరిజన విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వంట షెడ్, ప్రహరికి నిధులు మంజూరు చేస్తున్నట్లుగా తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పాఠశాలలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. మంజూరు అయినటువంటి ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గొంది గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ శర్మ, పంచాయతీరాజ్ డివో వైశ్య నాయక్, పిఆర్ ఏఈ వంశీ, కరెంట్ ఏ ఈ వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు కొనసా ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, పినపాక మాజీ సర్పంచ్ లు నాగేశ్వరరావు, తోలెం కళ్యాణి, కొర్స కృష్ణం రాజు, ఈసం భవతి, కాంగ్రెస్ నాయకులు మధ్యల సమ్మయ్య, గంగి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట రెడ్డి, ఉడుముల లక్ష్మి రెడ్డి, సాంబ, బుల్లి రెడ్డి, గట్టయ్య, రాజేష్, వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, సతీష్ చారి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సింహాద్రి, మనోజ్, సాయి, చందర్ రావు, మండల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగలు బాబోయ్ దొంగలు

**-వరుస చోరీలతో భయాందోళనలో ప్రజలు**
**-అప్రమత్తంగా ఉండాలి : పోలీసులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. గడిచిన నాలుగైదు రోజులుగా జిల్లాలో జరుగుతున్న వరుస చోరీలు చర్చనీయాంశమయ్యాయి. ఖమ్మంలో బొమ్మరిల్లు అపార్టుమెంటులో పట్టపగలు జరిగిన చోరీ కలకలం రేపింది. ప్రజా కళాకారుడు దేవేంద్ర ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం, నగదు దోపిడీకి గురైంది. అంతకు ముందు గొల్లగూడెంలో మారణాయుధాలు ధరించిన దొంగలు తిరగడం సిసి కెమెరాల్లో రికార్డు అయింది. సత్తుపల్లిలో ఇప్పటికే రెండు, మూడు వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఊరి వదిలి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తమకు సమాచారం ఇవ్వాలని ప్రకటిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు సంచరించినప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

# క్రీడలకు తగు ప్రాధాన్యతనివ్వాలి

**-ఎంపి వద్దిరాజు రవిచంద్ర**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** క్రీడలు, క్రీడాకారులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ తన పదేళ్ల పాలనలో తగు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించారని బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. కేసిఆర్ ప్రోత్సహంతో బ్యాడ్మింటన్‌లో గోపిచంద్, టెన్నిస్‌లో సానియా మీర్జా, బాక్సింగ్‌లో నిఖత్ జరీనా, క్రికెట్‌లో సిరాజ్ తన సొంత జిల్లా మహబూబాబాద్‌కు చెందిన సాధుల మేఘన షూటింగ్‌లో, ఆకుల శ్రీజ తదితరులు అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను చాటి రాణిస్తున్నారన్నారు. క్రీడల నిర్వహణలో లోపాలు, అంతర్గత అధికార పోరు తగ్గించి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జాతీయ క్రీడా పాలన బిల్లు 2025, ఉత్ప్రేరకాల నిరోధక బిల్లు 2025లను యువజన క్రీడల శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయ మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ క్రీడలను రోజు వారి జీవితంలో బాగం చేయడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాలు మహిళలు ఆర్థికంగా బలహీన వర్గాల నుండి భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు దోహదపడే ఈ బిల్లులకు తమ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. క్రీడలు ఒక శక్తివంతమైన ఐక్య, ఆరోగ్యకరమైన దేశ నిర్మాణానికి దోహదపడతాయని ఎంపి వద్దిరాజు రవిచంద్ర తెలిపారు.

# సిపిఐ నాయకునిపై దాడి

**-ఖండించిన మండల సమితి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ మండల సమితి సభ్యుడు మడుపల్లి వెంకటేశ్వర్లుపై ఆ గ్రామానికి చెందిన కొందరు మంగళవారం దాడి చేశారు. గత కొంతకాలంగా వెంకటేశ్వర్లుకు దాడికి పాల్పడిన వ్యక్తుల మధ్య భూ పంచాయితీ నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఒంటరిగా పొలం వద్దకు వెళ్లిన వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడ్డారు. ఆయనను హత్య చేసేందుకు ప్రయత్నించగా కేకలు వేయడంతో వదిలి వెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి బోనకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మడుపల్లి వెంకటేశ్వర్లుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్‌చేశారు. ఓ పథకం ప్రకారం హత్య చేసేందుకు ప్రయత్నించారని వారిపై కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆనందరావు కోరారు.

# కూలీలతో కలిసి నాటు వేసిన మల్లు నందిని



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని మీనవోలు గ్రామంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క మహిళ కూలీలతో కలిసి వరి నాటు వేశారు. మధిర నుండి జమలాపురంలో జరగుతున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి వెళ్తూ మీనవోలు గ్రామంలో కూలీలు నాటు వేస్తున్న దృశ్యాన్ని చూసి ఆగి ఆమె అక్కడికి వెళ్లి వారితో కలిసి నాటు వేసి కొద్దిసేపు ముచ్చటించారు. నాటు వేసినందుకు రోజువారీ కూలీ ఎంత వస్తుంది, ఒక ఎకరం ఎంతమంది కూలీలు నాటుతారు అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు నందినితో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపారు.

# మదర్‌థెరిస్సా సేవా సదనంలో అన్నదానం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర సేవా సమితి ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా సేవా సదనంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర వాస్తవ్యులు చేడే లక్ష్మ నారాయణ జయం తి సందర్భంగా వారి కుమార్తె, అల్లుడు వందనపు రాణి, వందనపు శ్రీనివాసరావు ల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మధిర సేవా సమితి అధ్యక్షులు ప్రసాదరావు తెలిపారు. మధిర సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఎంతో మందికి స్ఫూర్తినివ్వడం గొప్పవిషయమని మధిర సేవా సమితి ఆధ్వర్యంలో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ పేద ప్రజలను ఆదుకోవాలని వారు కోరారు. ప్రతి ఒక్కరూ వారి పుట్టినరోజును, పెండ్లి రోజు తదితర శుభ కార్యక్రమాలకు సంబంధించి అన్నదాన కార్యక్రమాలు చేస్తూ సహాయ సహకరాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామినేని రామనాథం, సాయి శ్రీకర్, చల్లా సత్యనారాయణ, రామకోటేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.